సాక్షి
ప్రకాశం

మంగళవారం । 1 । జూలై । 2025



ఒక సమస్య..ఏడు అర్జీలు

ఒకే సమస్యపై ఏడు సార్లు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని పొదిలికి చెందిన బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

- 8లో..



సెంచరీ కొట్టిన రిటైర్డ్ టీచర్ !

చీమకుర్తికి చెందిన రిటైర్డ్ టీచర్ వేమూరి వీరరాఘవయ్య నూరేళ్లు పూర్తి చేసుకుని 101 ఏళ్లు వచ్చిన సందర్భంగా ఆయన్ను సన్మానించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

తల్లికి వందనం ఈ-కేవైసీ పూర్తి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో భాగంగా పెండింగ్ ఈ-కేవైసీ మంగళవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి ఎంపీడీవోలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్వరమే పెండింగ్ ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది బదిలీ అయ్యే జూలై 5వ తేదీ లోపు సిటిజన్ ఈ-కేవైసీ కూడా పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

జూలై 8న 10 వేల ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ...

ఉపాధి హామీ పథకంలో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి చేపట్టాలని కలెక్టర్ చెప్పారు. ఫారం పాండ్స్, ఫిషింగ్ పాండ్స్, కంపోస్టు పిట్స్ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో 8వ తేదీ జిల్లాలో 750 ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, పాల్గొన్నారు.

కార్మికుల రోజువారీ వేతనాల సవరణ

ఒంగోలు వన్‌టౌన్: కార్మికుల రోజువారీ వేతనాలను కలెక్టర్ సవరణ చేసినట్లు ఒంగోలు ఉపకార్మిక కమిషనర్ ఎ.గాయత్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యం లేని కార్మికులకు రూ.694, కొంత వరకూ నైపుణ్యం ఉన్న కార్మికులకు రూ.791, నైపుణ్యం ఉన్న కార్మికులకు రూ.899, పూర్తి స్థాయిలో నైపుణ్యం ఉన్న కార్మికులకు రూ.1042గా వేతనాలు సవరించినట్లు వెల్లడించారు. సవరించిన వేతనాలు ఏప్రిల్ 1, 2025 నుంచి వర్తిస్తాయన్నారు.

ఎగిరిపోయిన నాణ్యత..!



కందుకూరు ఫ్లై ఓవర్ వద్ద దెబ్బతిన్న రన్‌వే

ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు యుద్ధ విమానాలు, సహాయక విమానాలు ఆగేందుకు వీలుగా కలికవాయ-కనుమళ్ల మధ్య జాతీయ రహదారిపై నిర్మించిన రన్‌వే నాణ్యతా లోపాలతో ప్రారంభం కాకుండానే ధ్వంసమైంది. మలుపులతో ఉన్న రన్‌వే ప్రారంభానికి ఎయిర్‌ఫోర్స్ అభ్యంతరం పెట్టింది. లోపాలు సరిచేసి దాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు మళ్లీ రూ.43 కోట్లు మంజూరు చేసి అదనంగా స్థల సేకరణకు చర్యలు చేపట్టారు.

- రూ.85 కోట్లతో జాతీయ రహదారిపై అత్యవసర విమానాల ల్యాండింగ్‌కు రన్‌వే నిర్మాణం
- నాసిరకంగా రన్‌వే పనులు
- నాణ్యతా లోపాలతో ప్రారంభం కాకుండానే ధ్వంసం
- రన్‌వేలో మలుపులతో ఎయిర్‌ఫోర్స్ అభ్యంతరం
- లోపాలు సరిచేసేందుకు మళ్లీ రూ.43 కోట్లు మంజూరు
- అదనంగా స్థల సేకరణకు చర్యలు

సింగరాయకొండ:

ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా జాతీయ రహదారిపై అత్యవసర పరిస్థితుల్లో విమానాలు ఆగేందుకు వీలుగా ఎయిర్‌పాడ్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రన్‌వేల నిర్మాణం చేపట్టింది. ఈ పథకం కింద దేశంలో 13 రన్‌వేలు నిర్మిస్తుండగా రాష్ట్రానికి కేటాయించిన రెండు రన్‌వేలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిర్మించారు. ఒక్కొక్కటి రూ.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ రన్‌వేల వలన ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు చేపట్టేందుకు, దేశ, రాష్ట్రానికి చెందిన ముఖ్య నాయకులు జిల్లా పర్యటన సమయంలో విమానాలు, హెలికాప్టర్లు ల్యాండ్ అవడానికి అవకాశం ఏర్పడుతుంది.

రాష్ట్రానికి రెండు రన్‌వేలు కేటాయించగా ఒకటి కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ మండల పరిధిలో జాతీయ రహదారిపై కలికవాయ నుంచి కనుమళ్ల మధ్య సుమారు 3.60 కిలోమీటర్ల దూరం, మరొకటి అద్దంకి నియోజకవర్గం జే పంగులూరు మండల పరిధిలోని జాతీయ రహదారిపై సుమారు 4 కిలోమీటర్ల దూరం కొరిశపాడు నుంచి రేణంగివరం మధ్య నిర్మించారు. ఈ రెండింటినీ ప్రముఖ నిర్మాణ సంస్థ కేఎంసీ చేపట్టింది.

పటిష్టంగా రన్‌వే నిర్మాణం:

రన్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు కావటంతో త్వరలో పనులు ప్రారంభిస్తామని, వేగవంతం చేస్తామని హైవే అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోడ్డులో దెబ్బతిన్న ప్రాంతాన్ని తొలగించి మళ్లీ నిర్మిస్తారు. అలాగే ప్రధాన రహదారికి ఇరువైపులా ఐరన్‌తో ఫెన్సింగ్ వేస్తారు. రోడ్డుకు ఇరువైపులా మూడు మీటర్ల వెడల్పుతో సర్వీసు రోడ్డు నిర్మిస్తారు. మండల కేంద్రం నుంచి వాహనాలు రన్‌వేపైకి రావాలంటే కందుకూరు ఫ్లైఓవర్, కలికవాయ ఫ్లైఓవర్ వద్ద మాత్రమే మారేందుకు అవకాశం ఉంటుంది. కలికవాయ, కందుకూరు ఫ్లైఓవర్‌ల మధ్య ఎక్కడా వాహనాలకు దారి ఇచ్చే అవకాశం ఉండదు. సర్వీసు రోడ్డు నిర్మాణం తరువాత ఇరువైపులా డ్రైనేజీ నిర్మిస్తారు. ఈ క్రమంలో రోడ్డు మలుపులను సరిచేస్తారు. అంతేకాక రన్‌వే మధ్యలో వాహనాలకు ఇబ్బంది లేకుండా రోడ్డుమధ్యలో పూర్తి స్థాయిలో సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేస్తారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదు. నిధుల మంజూరుతో రన్‌వే వినియోగంలోకి వచ్చేటట్లు సిద్ధం చేస్తామని త్వరలో స్థల సేకరణకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని హైవే అధికారులు వివరించారు.

నాసిరకపు పనులతో ప్రారంభం కాని కనుమళ్ల రన్‌వే

సింగరాయకొండ మండలంలోని రన్‌వేను కూడా 2022 కల్లా పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనుల్లో నాణ్యత లోపించటంతో ప్రారంభం కాకుండానే రోడ్డు ధ్వంసమైందన్న ఆరోపణలున్నాయి. రోడ్డు చాలా చోట్ల దెబ్బతినడంతో పాటు, రోడ్డు పగుళ్లు వచ్చాయి. కనుమళ్ల జంక్షన్ సమీపంలో కల్వర్టు నిర్మాణ సమయంలోనే కూలిపోయింది. దీనిని బట్టి పనులు ఎంత నాణ్యతగా జరిగాయో అర్థమవుతుంది. తరువాత ఆ కల్వర్టును మళ్లీ నిర్మించాల్సి వచ్చింది. ప్రస్తుతం దెబ్బతిన్న చోట తారుతో సరిచేసే ప్రయత్నం చేసినా వాహనాల తాకిడికి తారు లేచిపోయి కంకర.. రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. వాస్తవానికి సిమెంటు రోడ్డు కాలపరిమితి సుమారు 20 సంవత్సరాలు ఉంటుంది. కానీ రెండు మూడు సంవత్సరాలకే రన్‌వే దెబ్బతినటాన్ని బట్టి పనులు ఎంత నాసిరకంగా జరిగాయో తెలుస్తోంది. అంతేకాక రన్‌వే నిర్మాణంలో మలుపులు ఉండకూడదు. కానీ రన్‌వేలో మలుపులు ఉన్నాయని, దీనికి మార్పులు చేస్తే తప్ప విమానాల ల్యాండింగ్‌కు పనికిరాదని ఎయిర్‌ఫోర్స్ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో రన్‌వే ప్రారంభానికి నోచుకోలేదు.



కలికవాయ ఫ్లై ఓవర్ సమీపంలో దెబ్బతిన్న రన్‌వే



రన్‌వే మధ్యలో అరకొరగా ఉన్న సిమెంటు దిమ్మెలు

రన్‌వేకు అదనంగా రూ.43 కోట్లు మంజూరు

రన్‌వేను వినియోగంలోకి తేవటానికి గత సంవత్సరం రూ.38 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ఈ సంవత్సరం పెరిగిన ధరలతో రూ.43 కోట్ల అంచనా వ్యయంతో మళ్లీ ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయని త్వరలో రన్‌వే నిర్మాణానికి సంబంధించి అదనపు స్థల సేకరణతో పాటు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆశాఖ అధికారులు చెబుతున్నారు. రన్‌వే పూర్తి చేయటానికి రోడ్డుకు ఇరువైపులా 6 మీటర్ల చొప్పున స్థల సేకరణ చేయాల్సి ఉందని వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కే శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

రన్‌వేల నిర్మాణం ఇలా..

జాతీయ రహదారిపై రోడ్డు మధ్య నుంచి రెండు వైపులా 33 మీటర్ల చొప్పున అంటే మొత్తం 66 మీటర్ల వెడల్పున సిమెంటు రోడ్డు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా మూడు మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలిపెట్టి ఆ స్థలాన్ని డ్రైనేజీతో పాటు ఇతర అవసరాలకు ఉపయోగిస్తారు. సిమెంటు రోడ్డు నిర్మించే 3.60 కిలోమీటర్ల వరకు రోడ్డు మధ్యలో శాశ్వత డివైడర్‌ను నిర్మించకుండా తాత్కాలిక డివైడర్‌ను ఏర్పాటు చేశారు. ఈ రన్‌వే పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 2022లో వినియోగంలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జే పంగులూరు మండలం కొరిశపాడు-రేణంగివరం వద్ద రన్‌వే నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభమైంది.

బాబు మోసకారి..

- సూపర్ సిక్స్ పేరుతో ప్రజల్ని వంచించిన ఘనత చంద్రబాబుది
- హామీలు అమలు చేయాలని అడుగుతున్న వారిపై తప్పుడు కేసులు
- "బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి
- మాట తప్పిన పాలకులను నిలదీయండి: బూచేపల్లి



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న కారుమూరి, శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, ఆదిమూలపు, మేరుగు తదితరులు

ఒంగోలు సిటీ: ఎన్నికల ముందు ఎన్నో ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్ని చంద్రబాబు మోసం చేసి వెన్నుపోటు పొడిచాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పేరుతో ప్రజల్ని వంచించిన ఘనత చంద్రబాబుదేనని ధ్వజమెత్తారు. ఏడాది కాలంగా సాగిన వంచన పాలనపై ''బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'' కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధినాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని తెలిపారు. సూపర్ సిక్స్ కార్యక్రమాలు అమలు చేయకుండానే అన్నీ ఇచ్చేశామని చెప్పడం దుర్మార్గమన్నారు. సంవత్సరానికి మూడు సిలిండర్లు, పింఛన్లు 40 శాతం మందికి కూడా అందలేదన్నారు. నీకు రూ.15 వేలు..రూ.15 వేలు, రూ.18 వేలు, రూ.18 వేలు అంటూ మహిళల్ని దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని, అంతవరకూ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పుడు సిల్క్ డెవలప్‌మెంట్‌లో పెట్టేశామని చెబుతున్నారని విమర్శించారు. బాబు మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు ''బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'' పేరుతో వైఎస్సార్ సీపీ ప్రజల వద్దకు వెళుతోందన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో చేపట్టే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో చంద్రబాబు మోసాలను ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతున్న వారిపై అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. కష్టాల్లో ఉన్న పొగాకు రైతుకు అండగా నిలిచేందుకు జగన్ పొదిలికి వచ్చారన్నారు. ఇందుకు సంబంధించి అన్ని అనుమతులు తీసుకున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమంగా జొరబడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లపై రాళ్లతో దాడి చేశారన్నారు. అమరావతి పేరుతో ఆందోళన చేసిన వారిని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్పీని కలసి వినతి పత్రాన్ని ఇస్తామని, అవసరమైతే హైకోర్టులో ప్రైవేటు కేసు వేస్తామని హెచ్చరించారు. పార్టీ కేడర్‌పై అన్యాయంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పార్టీ లాయర్లతో అన్ని సిద్ధం చేశామన్నారు. లిక్కర్ కేసును సృష్టించి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై అన్యాయంగా కేసు పెట్టారన్నారు. ఆయన్ను అరెస్టు చేయడం హేయమన్నారు. ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా రూ.లక్షన్నర కోట్లు అప్పు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని దుయ్యబట్టారు. 2027లో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.

మాటతప్పిన కూటమి నేతలను నిలదీయండి : బూచేపల్లి

ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మభ్యపెడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. సూపర్ సిక్స్ ఇచ్చేశామని, అదేమని అడిగితే నాలుక మందం అంటూ బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ''బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ'' అంటూ ఎన్నికల్లో పోటీ చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన పాలన చూసి ''బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'' అంటూ ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. హామీలు తుంగలోకి తొక్కి, ఏ హామీలు నెరవేర్చారని గడపగడపకూ కార్యక్రమాన్ని పెట్టుకుంటున్నారని టీడీపీ ప్రజాప్రతినిధులను నిలదీశారు. తల్లికి వందనం పథకం చాలా మంది లబ్ధిదారులకు అందలేదన్నారు. చంద్రబాబు మోసాలను గుర్తుంచుకుని మీ గడప ముందుకు వచ్చిన వారిని నిలదీయండని ఆయన కోరారు. పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై లేని లిక్కర్ కేసు పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ మంత్రి కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, మాజీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేయండి

- అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ



సమ్మె నోటీస్ అందజేస్తున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ

ఒంగోలు సిటీ: ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలో ఉన్న అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ సోమవారం కోరారు. ఆమేరకు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలోని యూడీసీకి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కేవీ సుబ్బమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కస్తూరి, పద్మావతి పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు
- బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం

ఒంగోలు సిటీ: ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి, జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు అధికారం కోసం అలవికాని హామీలిచ్చి ''బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ'' అని ప్రజలను నమ్మించాడన్నారు. అధికారంలోకి వచ్చాక మ్యానిఫెస్టోను గాలికొదిలేశాడన్నారు. కుల, మత, వర్గ, విభేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



■ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు పదవులన్నీ అనుభవించి, అధికారం దూరమైన వెంటనే వారు అవకాశవాద రాజకీయాలు చేసి పార్టీని వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. మళ్లీ ఇప్పుడు పార్టీలోకి వస్తున్నారని ప్రచారం చేస్తున్నారని, అలాంటివాళ్లు పార్టీకి అవసరం లేదని, పార్టీ తీసుకోదని, వారిని పార్టీలో ఎవరూ సమర్థించరన్నారు.



■ జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఎలాంటి సంఘటనలు జరగకపోయినా అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏమీ జరగకపోయినా ఇంత మందిపై కేసులు బనాయించడం అన్యాయమని, అవసరమైతే జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు, పక్కన పార్టీ నాయకులు




■ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను తూచ తప్పకుండా అమలు చేశారన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి చంద్రబాబు అలవికాని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. నీ కార్యకర్తలను ఇంటింటికీ పంపి ఒక సంవత్సరంలో ఇంత అమౌంట్ వస్తుందని చెప్పావు. చంద్రబాబు మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా పథకాలు ప్రజలకు ఇవ్వలేదు కనుక నీమీద ఎందుకు కేసు పెట్టకూడదు అని ప్రశ్నించారు.



■ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అడ్డగోలుగా హామీలిచ్చి మీరు ఎలా ప్రశ్నిస్తారో ప్రశ్నించండి చూద్దాం అని చంద్రబాబు అంటాడన్నారు. ఇది ప్రజాస్వామ్యం అనీ, ఇక్కడ ఎవరైనా ప్రశ్నించవచ్చన్నారు. చంద్రబాబు మీ నియంతృత్వ పోకడలు చెల్లవని, ప్రజల పక్షాన ప్రశ్నిస్తామన్నారు. గడప గడపకు వెళ్లి చంద్రబాబును ప్రశ్నించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.



■ మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోని తీసుకొని వెళ్లి గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తాము, చంద్రబాబు మీ మ్యానిఫెస్టోని తీసుకొని వెళ్లి ప్రజలకు వివరించగలరా అని ప్రశ్నించారు.



■ మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని విమర్శించారు. ఎవరైతే హామీలను అమలు చేయాలని అడుగుతారో వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. రైతులకు అండగా ఉండేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనకు ప్రజలు బాగా వచ్చారని, దాంతో మా పై రాళ్లు వేసి, మామీద కేసులు పెట్టారన్నారు. అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన అణగదొక్కలేవనీ, ప్రజల గొంతు నొక్కలేవన్నారు.



■ మాజీ ఎమ్మెల్యే మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్యాయంగా అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు.



■ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న పిచ్చిచేష్టల వల్ల టీడీపీ నాయకుల్లోనే వ్యతిరేకత మొదలైందన్నారు. వారి నాయకుల్లోనే ఈ సారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తే తమ పరిస్థితి ఏంటని అంతర్మథనం చెందుతున్నారన్నారు.




■ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టి.జే.ఆర్ సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్, ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు మాదిగ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క సమస్య.. ఏడు అర్జీలు..!

● మీ కోసం కార్యక్రమాలలో కలెక్టర్‌కు ఏడు సార్లు అర్జీలిచ్చినా పరిష్కారం కాని సమస్య

ఒంగోలు సబర్బన్: ఒకే ఒక్క సమస్యపై జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలలో ఇప్పటి వరకూ ఏడు సార్లు అర్జీలిచ్చినా పట్టించుకో లేదని పాదిలికి చెందిన బాధితుడు వాపోయాడు. సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఏడోసారి అర్జీ అందజేశాడు. ఆ వివరాల్లోకెళ్తే.. పాదిలి మున్సిపాలిటీ పరిధిలోని దర్శి రహదారిలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో తన పొలానికి అడ్డంగా యోగయ్య అనే వ్యక్తి తాత్కాలికంగా షెడ్డు నిర్మించాడని పాదిలికి చెందిన దాసరి రవిచంద్ర అనే బాధితుడు ఏడాదికిపైగా క్షేత్రస్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. తన పొలంలోని వర్షం నీరు బయటకు పోవడానికి వీల్లేకుండా అక్రమంగా నిర్మాణం చేపట్టాడని స్థానిక అధికారులకు అనేక సార్లు అర్జీలు అందించారు. వారెవరూ పట్టించుకోకపోవడంతో ఒంగోలులో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలలో ఇప్పటికే ఆరు సార్లు దాసరి రవిచంద్ర అర్జీలు అందజేశాడు. షెడ్డు అడ్డంగా ఉండటంతో పొలంలోని నీరు బయటకు పోయే వీల్లేక పొలం కోతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశాడు. దీనిపై 2024 ఫిబ్రవరి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపాడు.



మీ కోసంలో దాసరి రవిచంద్ర ఏడోసారి ఇచ్చిన అర్జీకి అధికారులు ఇచ్చిన రసీదు

సోమవారం మరోసారి ఒంగోలులో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి వచ్చాడు. అడ్డగోలుగా యోగయ్య నిర్మించిన షెడ్డును తొలగించాలని ఏడోసారి కలెక్టర్‌కు అర్జీ అందజేశాడు. ప్రభుత్వ స్థలంలో తడికలు, రేకులతో యోగయ్య నిర్మించిన షెడ్డులో పగటి పూట కుటుంబంతో నివాసం ఉంటూ రాత్రి అయ్యేసరికి తోళ్లమడుగులోని తన సొంతింటికి వెళుతున్నాడని అర్జీలో తెలిపాడు. గతంలో మండల సర్వేయర్ కూడా పరిశీలించి ప్రభుత్వానికి చెందిన రోడ్డు స్థలంలోనే యోగయ్య షెడ్డు నిర్మించాడని తహసీల్దార్‌కు నివేదిక కూడా ఇచ్చారని, కానీ, ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపాడు. జేసీని కలిసినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పాదిలి తహసీల్దార్, నగర పంచాయతీ కమిషనర్, పోలీసులు వచ్చి చూసి వెళ్తున్నారుగానీ, తాత్కాలిక షెడ్డును తొలగించే ప్రయత్నం మాత్రం చేయడం లేదని వాపోయాడు. తన సమస్య పరిష్కారం కాకుండా ఉండటానికి అధికారులే ప్రధాన కారణమంటూ ఆరోపించాడు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అదే పనిగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకుండా ఉంటే ఇంకెవరికి మొరపెట్టుకోవాలో చెప్పాలంటూ రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

అర్జీదారులు సంతృప్తి చెందాలి : కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు బాధితులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశపు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఎస్డీసీలు కుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థసారధి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వైద్య రంగంలో దినదినాభివృద్ధి

ఒంగోలులో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల ద్వారా మెరుగైన వైద్య సేవలు

ఒంగోలు: జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరం వైద్య రంగంలో దినదినాభివృద్ధి చెందుతోంది. నగరంలో ప్రముఖ వైద్యులు ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో పలు రకాల ప్రత్యేక వైద్యసేవల కోసం గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఒంగోలు నగరంలోనే అన్ని రకాల ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండటంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఒంగోలులోని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల్లోనే జిల్లా ప్రజలు నాణ్యమైన ప్రత్యేక వైద్య సేవలు సైతం పొందుతున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జాయ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో సీనియర్ గర్భకోశ, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ రాజమ్మ, యూరో ఆంధ్రాలజిస్టు, కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ నోయల్ జాన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలిటీ డాక్టర్ జాన్సీమాధ్యూ అందుబాటులో ఉన్నారు. అదేవిధంగా సుందరయ్య భవన్ రోడ్డులోని గాయత్రి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్లో ఆర్థోపెడిక్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి సేవలందిస్తున్నారు. డాక్టర్ వి.ప్రత్యూషారెడ్డి ఊపిరితిత్తుల విభాగంలో సేవలందిస్తున్నారు. సత్యనారాయణపురం మొదటి లైన్‌లోని శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో సీనియర్ ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్యులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, సీనియర్ ప్రసూతి, సంతాన సాఫల్యత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్టు వైద్యురాలు డాక్టర్ చాపల శాంతకుమారి అందుబాటులో ఉన్నారు. కాపు కళ్యాణ మండపం పక్క వీధిలోని గీతా డయాబెటిస్, ఎండోక్రైన్ సెంటర్‌లో డాక్టర్ గీత ప్రియదర్శిని సుగర్, థైరాయిడ్, ఊబకాయం, ఇతర హార్మోను సమస్యలకు సేవలందిస్తున్నారు. లంబాడీడొంక పవర్ ఆఫీసు పక్కనున్న కేర్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలలో డాక్టర్ కె.వేణుగోపాల్, డాక్టర్ సీహెచ్ హిమశిల్ప అందుబాటులో ఉండి కట్టుడు పళ్లు, ఫిక్స్‌డ్, సిరామిక్స్, చిగుళ్ల వ్యాధులకు ఇంప్లాంటాలజిస్ట్ సేవలందిస్తున్నారు. అరవై అడుగుల రోడ్డులోని దానామూర్తి హార్ట్ హాస్పిటల్లో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు గుండెకు సంబంధించిన అన్ని రకాల చికిత్సలు అందిస్తుండగా, డాక్టర్ ఎస్.రమ్య పాథాలజీ విభాగంలో సేవలందిస్తున్నారు. అరవై అడుగుల రోడ్డులోని ఆర్కిడ్ ఫెర్టిలిటీ సెంటర్‌లో డాక్టర్ సింధూర సింఘు గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్టుగా సేవలందిస్తున్నారు. సుందరయ్య భవన్ రోడ్డులోని స్నేహ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో డాక్టర్ శరత్ మల్లి పెద్ది (న్యూరో విభాగం), డాక్టర్ సాయి స్నేహ యడ్లపల్లి (కంటి విభాగం), డాక్టర్ రంజిత్ బాషా (ఊపిరితిత్తుల విభాగం), డాక్టర్ అన్నాబత్తిన శ్రీహర్ష (జనరల్ విభాగం) సేవలందిస్తున్నారు. పండరీపురం బైపాస్ రోడ్డులోని ఫెర్టీకేర్ ఐవీఎఫ్ సెంటర్‌లో డాక్టర్ శ్రావణిరెడ్డి, డాక్టర్ ఉజ్వలజాస్తి గైనికాలజిస్టు విభాగంలో సేవలందిస్తున్నారు. సుందరయ్య భవన్ రోడ్డులోని ఏషియన్ హాస్పిటల్లో డాక్టర్ రాజశేఖర్ బొడ్డుపాటి మెదడు, వెన్నెముక శస్త్ర చికిత్సలు చేస్తుండగా, డాక్టర్ మానస మన్నె గ్యాస్ట్రో, లివర్ వ్యాధులకు వైద్యసేవలు అందిస్తున్నారు. అంజయ్యరోడ్డులోని వి.డెంటిస్ట్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో దంత వైద్యుడు డాక్టర్ చిడిపోతు హనుమంతరావు, డాక్టర్ చిడిపోతు వసుధ, డాక్టర్ యర్రంనేని వరుణ్ అందుబాటులోఉండి దంత సమస్యలకు సంబంధించిన అన్నిరకాల శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. పలు వైద్యశాలల్లో ఈహెచ్‌ఎస్ కార్డులు, ఎన్టీఆర్ ఆరోగ్య సేవా పథకం, ఇతర హెల్త్‌కార్డుల ద్వారా కూడా వైద్యసేవలు అందిస్తున్నారు.

సెంచరీ కొట్టిన రిటైర్డ్ టీచర్.!

● నూరేళ్లు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా సన్మానం


వీరరాఘవయ్యను సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘ సభ్యులు

చీమకుర్తి: పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ వేమూరి వీరరాఘవయ్య నూరేళ్లు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను పెన్షనర్ల సంఘ సభ్యులు సత్కరించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మర్రి లక్ష్మీనారాయణ, బండ్ల డేవిడ్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. మంచి ఆహారపు అలవాట్ల కారణంగానే తాను నూరేళ్లు పూర్తిచేసుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు వీరరాఘవయ్య తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ సభ్యులు అజాద్, యా.నారాయణ, రమణారెడ్డి, గురవయ్య, ఖాదర్‌వలి, గోపి, వెంకట్రావు పాల్గొన్నారు.